సాక్షి ములుగు

శుక్రవారం । 3 । మార్చి । 2023



ఏసీబీ వలలో జీపీ ఈఓ

రోడ్డు నిర్మాణ పనుల బిల్లు విషయమై సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ శివునిపల్లి మేజర్ జీపీ ఈఓ చిరంజీవి ఏసీబీకి పట్టుపడ్డాడు. - 8లో▸



వీధి కుక్కల స్వైర విహారం

పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గురువారం కుక్కల దాడిలో వృద్ధురాలు, చిన్నారితోపాటు పలువురు గాయపడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $35^0/19^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు ఓ మోస్తరుగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నల్లెల మరణం పార్టీకి తీరనిలోటు

తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే



ములుగు: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే అన్నారు. గురువారం నల్లెల కుమారస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బాధితుడి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సీతక్కతో కలిసి ఓదార్చారు.అనంతరం నల్లెల్ల స్మృతి గీతాన్ని ఆవిష్కరించారు. కుమారస్వామి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వెంకటాపురం(ఎం): జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. మండలంలోని నల్లగుంటలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిరోజు 100మందికి తగ్గకుండా పరీక్షలు చేయాలన్నారు. దగ్గరి చూపు సమస్య ఉన్న వారిని పరిశీలించిన వెంటనే ట్యాబ్‌లో వివరాలు నమోదు చేసి అద్దాలు ఇవ్వాలని చెప్పారు. ఇతర సమస్యలు ఉన్నట్లయితే వైద్యం అందించి ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, ఏఎస్ఎం అనురాధ, ఆప్టోమెట్రిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



ములుగు రూరల్: ఈశాన్య రాష్టాలలో బీజేపీ గెలిచిన సందర్భంగా జిల్లాకేంద్రంలోని జాతీయ రహదారిపై ఆపార్టీ నాయకులు గురువారం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ హవా కొనసాగుతుందన్నారు. బీజేపీ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, భూక్య రాజునాయక్, జవహర్, వాసుదేవరెడ్డి, సురేందర్, రవీంద్రాచారి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు సంరక్షణకు జాగ్రత్తలు అవసరం



వెంకటాపూర్(ఎం): వేసవికాలంలో పశువుల సంరక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ విజయభాస్కర్ సూచించారు. మండలంలోని పాలంపేట గ్రామంలో పశువైద్యాధికారి నటరాజ్ ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సరైన సమయంలో ఎదుగు వచ్చేలా చూడాలన్నారు. కృత్రిమ గర్భదారణ చేయించి చూడు నిలిచేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులను సరైన సమయంలో గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. గొర్రెలు, మేకలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందు తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డోలి రజిత శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్, పశు వైద్యాధికారులు డాక్టర్ నరసింహా, డాక్టర్ రాజశేఖర్, శ్రీధర్ రెడ్డి, సిబ్బంది వేణు, రాజేందర్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు కసరత్తు

జిల్లాలో 29యూనిట్లు

- ఇప్పటికే మూడింటికి టెండర్లు
- ఒక కట్టకు రూ.3
- మే రెండోవారం నుంచి ఆకు సేకరణ



ములుగు: దట్టమైన అటవీ ప్రాంతంలోని ములుగు ఏజెన్సీవాసులకు రెండో పంటగా మారిన తునికాకు కల్లాల నిర్వహణకు అటవీశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ప్రతి ఏడాది వేసవిలో తునికాకు సేకరించడం సర్వసాధారణంగా మారింది. ప్రతిసారిలాగే అటవీశాఖ నిబంధనల మేరకు ఆన్‌లైన్ టెండర్లకు ఆహ్వానం పలుకుతోంది. జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్లలో 29యూనిట్లకుగానూ ఇప్పటి వరకు డిమాండ్ ఉన్న మూడు (ఎస్ఎస్ తాడ్వాయి రేంజ్ పరిధిలోని లవ్వాల, తుపాకులగూడెం-బీ, ఎస్ఎస్ తాడ్వాయి-బీ) యూనిట్లకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. మిగతా వాటిని ఓపెన్ ఆన్‌లైన్ ద్వారా విడతల వారీగా టెండర్లు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఏప్రిల్‌లో కొమ్మకొట్టడం, మే నెల రెండో వారం నుంచి ఆకు సేకరణ పనులు మొదలుకానున్నాయి. గతేడాది సేకరించిన తునికాకు బోనస్ డబ్బులు మరో వారంరోజుల్లో రానున్నట్లుగా తెలవడంతో ఏజెన్సీవాసులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

24,300 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం

గతేడాది 29యూనిట్లలో 302 కల్లాల ద్వారా 23,800 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెట్టుకోగా కేవలం 19,387 స్టాండర్డ్ బ్యాగులను మాత్రమే సేకరించగలిగారు. ఈ ఏడాది పుష్కలమైన వర్షాలు కురవడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో అటవీ విస్తీర్ణం పెరిగిందని భావించిన అటవీ శాఖ ఈ ఏడాది 24,300 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది 50 ఆకుల కట్టకు రూ.2.05 పైసలు ఉండగా ఆ రేటును తాజాగా ప్రభుత్వం రూ.3కు పెంచడంతో ఎక్కువగా సేకరణ జరుగుతుందని భావిస్తున్నారు.

జిల్లా అధికారులు నో.. పీసీసీఎఫ్ అనుమతి

ఏటూరునాగారం అటవీ ప్రాంతాన్ని వైల్డ్‌లైఫ్ శ్యాంక్చురీగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికితోడు రెండు సంవత్సరాలుగా కన్నాయిగూడెం నుంచి మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం వరకు పులులు, చిరుతలు సంచరిస్తున్నట్లుగా అటవీశాఖ గుర్తించింది. ఈ ఏరియాను టైగర్ జోన్‌గా ప్రకటించాలని ప్రభుత్వం సైతం భావించింది. ఈ క్రమంలో తాడ్వాయి రేంజ్‌లో పులి ఉచ్చుకు బలి అయిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ములుగు అటవీ అధికారులు ఏటూరునాగారం, ఎస్ఎస్ తాడ్వాయి-ఏ, బీ, తుపాకులగూడెం-ఏ, బీ, షాపెల్లి, మొట్లగూడెం యూనిట్లలో తునికాకు సేకరణను నిలిపాలని ప్రభుత్వానికి నివేదికను అందించారు. పీసీసీఎఫ్ తరఫున మాత్రం అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తుంది. ఎస్ఎస్ తాడ్వాయి-బీ యూనిట్ ఓపెన్ టెండర్‌లో అమ్ముడు పోవడం ఇందుకు నిదర్శనంగా తెలుస్తుంది.

ఆకు సేకరణ అంచనా (స్టాండర్డ్ బ్యాగులు)

ములుగు సబ్ డివిజన్
యూనిట్లు-11,
కల్లాలు-96,
స్టాండర్డ్ బ్యాగులు-8,800

ఎస్ఎస్ తాడ్వాయి సబ్ డివిజన్
యూనిట్లు-7,
కల్లాలు-71,
స్టాండర్డ్ బ్యాగులు-5,900

వెంకటాపురం(కె) సబ్ డివిజన్
యూనిట్లు-4,
కల్లాలు-84,
స్టాండర్డ్ బ్యాగులు-3,100

ఏటూర్‌నాగారం(వైల్డ్‌లైఫ్) డివిజన్
యూనిట్లు-7,
కల్లాలు-51,
స్టాండర్డ్ బ్యాగులు-6,500

ఓపెన్ టెండర్లు జరుగుతున్నాయి..



జిల్లాలో 29 యూనిట్లు ఉన్నాయి. 302 కల్లాలను నిర్వహిస్తున్నాం. యూనిట్లు అన్నీ ఆన్‌లైన్ ఓపెన్ టెండర్ ద్వారా జరుగుతున్నాయి. ఈ ఏడాది 24,300 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ సారి 50 ఆకుల కట్టకు రూ.3గా ధర నిర్ణయమైంది. ఇప్పటివరకు మూడు యూనిట్లకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో మిగతావాటికి టెండర్లు జరుగనున్నాయి. గతేడాది నాణ్యమైన ఆకు లభించింది. ఈ ఏడాది సైతం ముందుగానే ప్రజలకు అవగాహన కల్పిస్తాం. - **కృష్ణ గౌడ్, అటవీశాఖ జిల్లా అధికారి**

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

- ప్రారంభోత్సవాలకు సన్నద్ధం కావాలి
- కలెక్టర్ కృష్ణ ఆదిత్య



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: మన ఊరు-మన బడి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం కావాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలో రోజుకు ఒక పాఠశాలను విజిట్ చేయాలని ఆదేశించారు. టెన్త్‌లో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో సీసీరోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఈఈ నరేందర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ వెంకటేశ్, ఈఈలు, ఏఈలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి

ఏటూరునాగారం: అడవిని ఆధారంగా చేసుకొని సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులతో గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో గిరిజన సహకార సంఘం సొసైటీ పాలకమండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ జీసీసీ ద్వారా అమలవుతున్న పథకాలు, అటవీ ఉత్పత్తులకు నిర్ణయించిన ధరలను గిరిజనులకు వివరించారు. అటవీ ఉత్పత్తుల సమయంలో ఏదైనా ప్రమాదాలకు గురైతే అందుకు ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా దక్కుతుందన్నారు. వన్ దన్ పథకం కింద కూడా సేకరణకు ప్రత్యేకమైన డ్రెస్‌లు, పనిముట్లను అందజేశామన్నారు. జీసీసీ బ్రాంచీల వారీగా సొసైటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సభ్యులు, డైరెక్టర్లు సూచనలు చేయాలన్నారు. వాటిని అమలుచేసి అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. త్వరలో సొసైటీ ఎన్నికలు జరుగుతాయని, ఆసక్తిగా ఉన్నవారు ఎన్నికైతే ప్రజాప్రతినిధులుగా అనుభవం వస్తుందన్నారు. అటవీ ఉత్పత్తులు సేకరణ తగ్గుతుందని అందుకోసమే ప్యాడీ సెంటర్లు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. పాఠశాలలకు జీసీసీ ద్వారా రేషన్ సప్లయ్ చేస్తున్నామన్నారు. డివిజన్‌లో 14 బంక్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వచ్ఛమైన తేనెను జీసీసీ ద్వారా పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ దేవ్, డైరెక్టర్ పులుసం పురుషోత్తం, డీఆర్‌ఓ నరేందర్, సొసైటీ సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.



ముస్తాబైన ఆలయం..

అట్టహాసంగా కోటంచ జాతర

ప్రత్యేక పూజల్లో భక్తులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఉదయం అభిషేకంతో మొదలై, స్వామివారిని సూర్యవాహన ఆలయ సిబ్బంది సూర్య వాహనసేవలో మాడ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలతో మొదలైన జాతర సాయంత్రం స్వస్తి వాచనము అనంతరం శేష వాహనసేవ, అంకురారోహనము కార్యక్రమాలు కొనసాగాయి. జాతరలో దేదీప్యమానంగా వెలుగొందేందుకు అధికారులు ఆలయాన్ని దీపాలంకరణ చేశారు.

భక్తుల కోసం సకల సౌకర్యాలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ, ఆర్టీసీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. జాతర మొదటి రోజు కావడంతో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఆలయ చైర్మన్ అనితకరుణాకర్‌రెడ్డి దంపతులు



బ్రహ్మోత్సవాలలో సూర్య వాహన సేవలో ఊరేగిస్తున్న భక్తులు

ఆరోగ్యం కోసం జాగ్రత్తలు పాటించాలి

డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ

ములుగు: బాలికల సంపూర్ణ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. గురువారం కేర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిశోర బాలికల ఆరోగ్య పరిస్థితులపై పుస్తకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కౌమార దశలో బాలికలు ధృడంగా ఉండేందుకు నాలుగు సూత్రాలను పాటించాలని అన్నారు. బాలికలు సమతుల్య ఆరోగ్యం, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని చెప్పారు. బాలికలు రక్తహీనత, ఐరన్‌లోపం, నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేర్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ విజయ్, రూప్‌సింగ్, కల్యాణి, రమాదేవి, సాయిప్రియ, కార్యాలయ సిబ్బంది తిరుపతయ్య, దుర్గారావు, సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రైవేటీకరణను నిలిపేయాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ



ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ములుగు రూరల్: ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరణ చేయడం సరికాదని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ అన్నారు. అంగన్‌వాడీలు గురువారం జిల్లాకేంద్రంలో ధర్నా, వంటవార్పు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్యాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులుగా పని చేస్తున్నారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చేందుకు పని చేస్తున్న వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, నాయకులు ఎండీ దావూద్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజన, సమ్మక్క, పద్మ, భాగ్య, జమున, సరిత, సంధ్య, పార్వతి, రాధిక, వనమాల, విజయలక్ష్మి, లలిత, రేఖ, కవిత పాల్గొన్నారు.

వీధి కుక్కల సంచారం!

- భయాందోళనలో ప్రజలు, భక్తులు
- నివారించాలని భక్తులు మొర



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కాళేశ్వరం పుణ్యక్షేత్రం కావడంతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలకు కూడలిగా ఉంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారు. పలువురు ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు కాళేశ్వరం మీదుగా ప్రయాణిస్తుంటారు. దీంతో వీధికుక్కలు రహదారులపై సంచరిస్తూ వాహనదారులను, కాలినడకన వచ్చే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా చికెన్ సెంటర్లు, ఆలయ పరిసరాలు, గోదావరి తీర ప్రాంతం, మద్యం దుకాణాలు, వీధుల్లో స్వైరవిహారం చేస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రివేళల్లో బయటికి వెళ్లాలంటే పెద్దలతో పాటు పిల్లలు జంకుతున్నారు. కనీసం పిల్లలు ఆటలు ఆడుకోవడానికి రోడ్డెక్కని పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. హైదరాబాద్ ఘటనను దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గం, జిల్లా అధికార యంత్రాంగం వీధి కుక్కలను నివారించాలని పలువురు కోరుతున్నారు. యాత్ర స్థలం కావడంతో యాత్రికులు పడేసిన ఆహార పదార్థాలు, వ్యర్థపదార్థాలు, మాంసానికి అలవాటు పడి కుక్కలకు ఎర్రిలేచి గ్రామంలో తిరుగుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు.

లౌకికవాదాన్ని పరిరక్షించాలి

భూపాలపల్లి అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, రాజ్యాంగ సంస్థలను ధ్వంసంచేస్తూ మాట్లాడే హక్కు, ప్రశ్నించే గొంతులను నొక్కివేస్తున్నారని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా సమితి ఆధ్వర్యంలో లౌకికవాదాన్ని పరిరక్షించండి -బుజ్జగింపు ధోరణి ఓడించాలనే అంశంపై జిల్లా కేంద్రంలో గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి కొరిమి సుగుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలపై జరిగిన నేరాలకు సంబంధించి దాదాపు 31వేల ఫిర్యాదులు జాతీయ మహిళా కమిషన్‌కు గతేడాది వచ్చాయన్నారు. దీనిలో ఎక్కువ శాతం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, హర్యానాలో ఉన్నాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సైతం వరుస సంఘటనలు బెంబేలెత్తిస్తున్నాయని చెప్పారు. వరంగల్‌లో ప్రీతి, నంద్యాలలో పరువు హత్య, భూపాలపల్లిలో వేధింపులకు బలయ్యారని గుర్తుచేశారు. ఆడపిల్లలు ఇంట్లో నుంచి బయటికి అడుగు పెట్టాలంటే భయపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం నాయకులు ప్రవీణ్‌కుమార్, పద్మ, సునీత, లావణ్య, మౌనిక, కల్పనా సౌజన్య, విజయ, సువర్ణ పాల్గొన్నారు.

గనిని సందర్శించిన డీఎంఎస్ బృందం

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 6వ గనిని గురువారం డీఎంఎస్ అధికారుల బృందం సందర్శించింది. డీఎంఎస్ సంజీవ్‌కుమార్ గనిలోకి వెళ్లి 3వ సీమ్‌లో తనిఖీ చేశారు. కార్మికులకు ఎస్ఓపీ, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లపై అవగాహన కల్పించారు. ఏరియా ఉత్పత్తి స్థాయి పెంపొందించడానికి ప్రతి ఉద్యోగి కలిసిమెలిసి శ్రమించి రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. విధిగా రక్షణ పరికరాల ధరించి విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు బండి వెంకటయ్య, ప్రసాద్, ఎన్‌వీ రావు, శ్రీరామ్ భరోస్ మెహెతో, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు 'ఆర్టీఏ' నోటీసులు

రామప్ప శిల్ప సంపద అమోఘం

నేటి నుంచి యోగా మహోత్సవం

- 10లో▸

రాష్ట్ర బృందం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్‌తో కలిసి రాష్ట్ర పరిశీలన బృందం సందర్శించింది. పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, తొలిమెట్టు కార్యక్రమాల అమలు తీరును సభ్యులు పరిశీలించారు. రాష్ట్ర బృందం సభ్యులు మనోహరచారి, శ్రీనివాసచారి విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను పరిశీలించారు. ప్రశ్నించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గతంలో 11పరీక్ష పేపర్లకు బదులు ప్రస్తుతం ఆరు పేపర్లు ఉంటాయన్నారు. అభ్యాస దీపికలు ఉపయోగకరంగా ఉంటాయని.. చదువుకొని ఉత్తీర్ణత గ్రేడ్లను పెంచుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకొని చదివించడాన్ని తెలుసుకుని ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్ర పరిశీలన బృందంతో పాటు సెక్టోరియల్ అధికారి కిషన్‌రావు, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య, ఉపాధ్యాయులు బాలశౌర్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

గిరిజన బాలికల పాఠశాల సందర్శన



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కల్యాణ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గిరిజన బాలిక పాఠశాలను ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయ జేడీ ట్రికార్ డాక్టర్ పి.కల్యాణ్ గురువారం సందర్శించారు. ×సి₹ కేటగిరి విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 100శాతం ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. పాఠశాలలోని అన్ని తరగతులను సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలోని వసతులు, విద్యార్థులకు కాస్మొటిక్స్, న్యూట్రిషన్ ఫుడ్, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. కంప్యూటర్ శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఆయనతో పాటు ఏటీడీఓ దేశిరాంనాయక్, హెచ్ఎం అమలారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిల్డ్రన్స్ హోమ్‌కు బాల కార్మికులు



చిన్నారులతో రోడ్డు పనులు చేయిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్‌లైన్ కౌన్సిలర్ అరుణ

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడ: 'కంకర పని.. కక్కుర్తి కాంట్రాక్టర్' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గంగారం మండలం కామారం రోడ్డు పనుల్లో శ్రమిస్తున్న చిన్నారులను చైల్డ్ లైన్ అధికారులు చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించారు. గురువారం అధికారులు పనులు జరిగే చోటికి వెళ్లారు. అప్పటికే ఇద్దరు చిన్నారులు పనులు చేస్తూ అధికారులకు పట్టుబడ్డారు. పిల్లలతో కంకర పనులు చేయిస్తున్న తల్లిదండ్రులకు చైల్డ్‌లైన్ కౌన్సిలర్ అరుణ కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను మహబూబాబాద్‌లోని బాలగృహం, బాలున్ని దైవకృప హోంకు తరలించారు. పనులు చేయిస్తున్న వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట అనిల్, వంశీ ఉన్నారు.

పట్టపగలే చోరీ



వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం బీసీ మర్రిగూడెం పంచాయతీకి చెందిన వీరస్వామి ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.13 లక్షల విలువైన బంగారం, రూ.18 వేల నగదు ఎత్తుకెళ్లారు. సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న వీరస్వామి సాయిబాబా ఆలయంలో పూజ చేసేందుకు భార్యతో కలిసి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. సీఐ శివప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

ఏసీబీ వలలో జీపీ ఈఓ

- రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- ఆర్నెళ్లలో ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీసీపీ సుదర్శన్

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి గ్రామ పంచాయతీ ఈఓ కుర్ర చిరంజీవి సీసీ రోడ్ల నిర్మాణ పనుల బిల్లుల విషయమై సబ్ కాంట్రాక్టర్ నుంచి రూ.50వేలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీసీపీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివునిపల్లికి చెందిన సీసీ రోడ్లు తదితర రూ.21 లక్షల అభివృద్ధి పనుల్ని చిల్పూరు మండలం పల్లగుట్టకు చెందిన సబ్‌కాంట్రాక్టర్ శివరాత్రి కొమురయ్య ఏడాది క్రితం పూర్తి చేశాడు. ఆ బిల్లుల కోసం కొమురయ్య పలుమార్లు ఈఓ చుట్టూ తిరిగాడు. దానికి ఈఓ రూ.65 వేలు లంచం అడిగాడు. కొమురయ్య మొదట రూ.15 వేలు ఇచ్చాడు. మిలిగిన డబ్బులు బిల్లులు చేశాక ఇస్తానని చెప్పాడు. ఎంతకూ బిల్లు చేయకపోవడంతో గత నెల 23న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం సబ్‌కాంట్రాక్టర్ శివునిపల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్ వద్ద రూ.50 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఈఓను పూర్తి స్థాయిలో విచారించి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిస్తామని ఏసీబీ డీసీపీ సుదర్శన్ తెలిపారు.

ఆర్నెళ్ల వ్యవధిలో ఒకే శాఖ నుంచి ఇద్దరు..



ఏసీబీకి చిక్కిన ఈఓ చిరంజీవి

మండలంలో ఆర్నెళ్లలోపు ఒకే శాఖ నుంచి ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది. ఘన్‌పూర్ ఎంపీడీఓగా పని చేసిన కుమారస్వామి గతంలో శివునిపల్లి ప్రత్యేక అధికారిగా పని చేశారు. ఈక్రమంలో ఆయన లంచం తీసుకుంటూ ఆగస్టులో ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. శివునిపల్లి ఈఓగా పని చేసిన వెంకటకిషోర్ ఎంపీడీఓను ఏసీబీకి పట్టించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. కాగా.. వెంకటకిషోర్ స్థానంలో వచ్చిన ప్రస్తుతం శివునిపల్లి ఈఓగా పని చేస్తున్న చిరంజీవి ఏసీబీకి చిక్కడం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. కాగా.. ఉత్తమ అధికారులుగా అవార్డులు తీసుకున్న వారే ఒకే శాఖ నుంచి ఏసీబీకి చిక్కడం గమనార్హం. ఆర్నెళ్ల వ్యవధిలో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడంతో మండలంలో అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం అవుతోంది.

తిప్పించుకున్నాడు..



శివునిపల్లికి చెందిన ఎంపీటీసీ రాజుకు వచ్చిన పనులను నేను సబ్ కాంట్రాక్టు తీసుకున్నా. రూ.21 లక్షల పనులు చేసి ఏడాదిగా ఈఓ చుట్టూ తిరుగుతున్నా. అతను మొదట రూ.1.20 లక్షలు డిమాండ్ చేశాడు. అనంతరం రూ.65 వేలకు ఒప్పుకున్నాడు. మూడు నెలల క్రితం రూ.15 వేలు ఇచ్చా. అయినా పని చేయకపోవడంతో మిగిలిన డబ్బులిస్తేనే చేస్తానన్నాడు. దాంతో ఏసీబీ అధికారులను సంప్రదించా.

- సబ్‌కాంట్రాక్టర్ కొమురయ్య

సిగ్మా ఆస్పత్రి ఎదుట ఆందోళన



అఖిల(ఫైల్)

హన్మకొండ చౌరస్తా: చావు బతుకుల మధ్య ఆస్పత్రికి వచ్చిన బాలికకు వారం నుంచి చికిత్స చేస్తున్నట్లు చెబుతూ.. ఆస్పత్రి యాజమాన్యం రూ.16 లక్షలు వసూలు చేసిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. బిల్లు మొత్తం చెల్లించాక చావు కబురు చల్లగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మృతురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మృతురాలి బంధువు దిలీప్, సోదరుడు రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలా వరంగల్ మండలంలోని గాడిపెల్లి గ్రామానికి చెందిన బెల్లి అఖిల(18) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 23న కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు హనుమకొండ కొత్తబస్టాండ్ సమీపంలోని సిగ్మా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక పరీక్షలు చేసిన డాక్టర్ శ్రీనివాస్ అత్యవసర విభాగంలో అడ్మిట్ చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఒప్పుకుని అడ్మిట్ చేశారు. వారం రోజుల పాటు చికిత్స అందిస్తున్నట్లు చెబుతున్న వైద్యులు రూ.16 లక్షలు వసూలు చేశారు. గురువారం ఉదయం సైతం అఖిల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని తెలిపారు. సాయంత్రం వరకు తమకు చూపెట్టకుండా నమ్మబలుకుతూ వచ్చారని, గట్టిగా నిలదీయడంతో అఖిల మృతి చెందిన విషయం చెప్పారని రోదిస్తూ తెలిపారు. ఆగ్రహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. డబ్బుల కోసం చికిత్స అందిస్తున్నట్లు నటించారని, ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతురాలి తల్లిదండ్రులు బెల్లి మొండయ్య, యాక లక్ష్మి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఆందోళన విషయం తెలుసుకున్న హనుమకొండ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

లారీ దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన లారీ

వెంకటాపురం (కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ సమీపంలో ఆగి ఉన్న లారీ గురువారం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి రామచంద్రాపురం ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకెళ్లేందుకు లారీ అక్కడికి వచ్చింది. కాగా.. గురువారం తెల్లావారుజామున లారీ మంటల్లో కాలిపోయింది. లారీకి ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లారీకి మంటలు ఎలా అంటుకున్నాయనే విషయంపై పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

వీధి కుక్కల స్వైర విహారం

- ఏడుగురికి గాయాలు



గాయపడ్డ చిన్నారి

జనగామ: పట్టణంలోని హనుమకొండ రోడ్డు ప్రెస్టన్ ఏరియా.. శ్రీసాయి రెసిడెన్షియల్ కాలనీలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. గురువారం తెల్లవారుజామున కాలనీవాసులపై ఓ నల్ల కుక్క దాడి చేసేందుకు యత్నించి భయభ్రాంతులకు గురి చేసింది. కాలనీలో కూరగాయలు అమ్మేందుకు వచ్చిన ఓ మహిళను ఓ కుక్క కరిచింది. వాకింగ్‌కు వెళ్తున్న మరో నలుగురిపై దాడి చేసింది. మరో ఐదు నిమిషాల తర్వాత కిరాణా దుకాణానికి వెళ్లేందుకు బయటకు వచ్చిన 50 ఏళ్ల బి.కిష్టయ్యపై దాడి చేసి గాయపరిచింది. పట్టణానికి చెందిన రాజిరెడ్డి, మాధవి దంపతుల 6 ఏళ్ల కుమార్తె పూర్ణశ్రీ దుకాణానికి వెళ్తుండగా కుక్క విచక్షణా రహితంగా దాడి చేసింది. చిన్నారి చేయి, చెవి, మెడ, కాలు, ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. కాగా.. మాసం విక్రయ దుకాణాలు, ఫంక్షన్ హాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మీల్స్ హోటల్స్ ప్రాంతాల్లో మిగిలిన ఆహార పదార్థాలను బయట వేస్తుండడంతో కుక్కల బెడద తీవ్రమవుతోంది. కుక్కల బెడద తీవ్ర మవడం తో కాలనీల ప్రజలు కర్రలు చేతిలో పట్టుకుని బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది.

విద్యార్థినులకు ఆకతాయిల వేధింపులు

కాశిబుగ్గ: వరంగల్ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) ఎదుట ఆకతాయిల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. విద్యార్థినులు స్కూలుకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. అడ్డుకున్నవారిని బెదిరిస్తున్నారు. ఈస్కూల్లో పదో తరగతిలో దాదాపు వంద మంది విద్యార్థినులు ఉంటారు. వారు స్కూలుకు వెళ్తుండగా, వస్తుండగా ఆకతాయిలు బైక్‌లపై వచ్చి వేధిస్తున్నారు. స్పీడ్‌గా బైక్‌లు నడిపిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారు. గురువారం సాయంత్రం పాఠశాల వదిలే సమయంలో ఇద్దరు ఆకతాయిలు పాఠశాల గేటు ఎదుట బైక్ పెట్టుకుని అమ్మాయిలను వెకిలి చేష్టలతో ఇబ్బందులకు గురి చేశారు. బైక్‌పై స్పీడుగా వెళ్తూ.. వారిని ఇబ్బందులకు గురి చేశారు. ఇలా ఎందుకు చేస్తున్నారంటూ ఉపాధ్యాయులు బైక్ ఆపి వారిని అడిగితే వారిని బెదిరించి వెళ్లిపోయారు. గతంలో కొందరు ఆకతాయిలు ఇలాగే ప్రవర్తిస్తే ఉపాధ్యాయులు షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఎదుట, శివాలయం దారిలో షీటీం పోలీసులు నిఘా పెంచాలని, ఆకతాయిల భరతం పట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రాణం తీసిన అత్యాశ

బచ్చన్నపేట: అప్పు చేసి విదేశీ సంస్థల్లో పెట్టుబడి కోసమని ఓ మహిళ చేతుల్లో డబ్బు పెట్టి, చివరికి మోసపోయానని తెలిసిన మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన డ్యాగరి నర్సింగారావు(48) ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగారావు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అక్కడే ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో దగ్గరి బంధువైన ఓ మహిళతో స్నేహం ఏర్పడింది. విదేశీ సంస్థల్లో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు పొందవచ్చని ఆమె సూచించింది. దీంతో అతడు అత్యాశకు పోయి తెలిసిన వారి దగ్గర, బంధువుల దగ్గర రూ.1.50 కోట్లు అప్పు తీసుకుని ఆమె చేతుల్లో పెట్టాడు. కొద్ది రోజులకు తిరిగి తన డబ్బు తనకివ్వాలని అడగ్గా ఆమె ప్లేటు ఫిరాయించింది. ఏం చేయాలో తెలియక స్వగ్రామమైన కొన్నెకు వచ్చి మంగళవారం ఉరేసుకున్నాడు. రెండు రోజుల అనంతరం చుట్టు పక్కల వారు తలుపులను పగులగొట్టి చూడగా.. అతడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా.. నర్సింగారావు తన కుమారుడిని ఉన్నత చదువుల నిమిత్తం వారం క్రితమే అమెరికాకు పంపించాడు. ఆ ఆనందం నుంచి తేరుకోక ముందే కుటుంబంలో విషాదం అలుముకుంది.

భార్యతో గొడవపడి ఒకరు..

మడికొండ: భార్యతో గొడవ పడి మడికొండకు చెందిన చల్ల నాగరాజు(37) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాది కొత్తగూడెం జిల్లా ముల్కపల్లి గ్రామం రామనుంజనేయపురం గ్రామానికి చెందిన చల్ల నాగరాజు బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం మడికొండకు వచ్చి స్థానిక యువతి వల్లెపు రాజేశ్వరిని వివాహం చేసుకున్నాడు. వీరు కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం తాగి రావడంతో భార్యతో గొడవ పడ్డాడు. భార్య బయటకు వచ్చి కూర్చోగా, నాగరాజు ఇంట్లో ఉరేసుకొన్నాడు. కాసేపటికి భార్య వెళ్లి చూడగా.. నాగరాజు విగత జీవిగా వేలాడుతున్నాడు. మృతుడి అన్న చల్ల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై నర్సింహరావు తెలిపారు.

మనస్తాపంతో మరొకరు..

పెండ్యాల్-నష్కల్ రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం ఒక వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై అశోక్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండకు చెందిన ఎలకంటి శివాజీ(30) పేయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. వ్యక్తిగత సమస్యల వల్ల జీవితంపై మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- గుండెపోటుతో బ్యాంకు ఉద్యోగి మృతి
- ఆగిన రిసెప్షన్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. ఒకరు గాయపడ్డారు.

కురవి: మరికొద్ది గంటల్లో వరుడి ఇంట్లో పెళ్లి రిసెప్షన్. ఆనందంగా గడపాలని అంతా సిద్ధమవుతున్నారు. అంతలో ఆనందమంతా ఆవిరైంది. వధువు అన్న గుండెపోటుతో మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం శివారు జుజ్జూర్ తండా గ్రామంలో బానోత్ విజేందర్(31) గురువారం గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. జుజ్జూర్ తండాకు చెందిన బానోత్ విజేందర్ జగిత్యాల జిల్లాలో యూనియన్(ఆంధ్రాబ్యాంకు)లో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడి బాబాయ్ కుమార్తె వివాహం బుధవారం తండాలో అట్టహాసంగా జరిగింది. గురువారం పెళ్లి కుమారుడి గ్రామంలో జరిగే రిసెప్షన్‌కు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. అదే సమయంలో విజేందర్‌కు గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. పెళ్లి కుమార్తె అన్న మృతి చెందడంతో సంతోషంగా ఉండాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. రిసెప్షన్ నిలిచిపోయింది.

స్నేహితుడి పెళ్లి వేడుకలకు వెళ్లొస్తూ..

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కోనాయిచలం గ్రామానికి చెందిన చంద రమణ(21) మృతి చెందాడు. రమణ, అనిల్ బైక్‌పై బుధవారం సాయంత్రం ఇదే మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడి పెళ్లి బరాత్‌కు హాజరయ్యారు. అనంతరం తిరిగి వస్తుండగా ఓబులాపూర్ క్రాస్ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోడకు ఢీకొట్టింది. ఈఘటనలో రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంతో పాటు పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేసరికి రమణ మృతి చెందాడు. అనిల్ తీవ్ర గాయాలతో స్పృహ తప్పి పడిపోయాడు. అనిల్‌ను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.



రమణ మృతదేహం



విజేందర్(ఫైల్)

జాతీయ కబడ్డీ క్రీడాకారుడు..



ప్రశాంత్(ఫైల్)

కురవి: మండలంలోని నేరడలో సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు తుడుం ప్రశాంత్(45) అలియాస్ పెంటయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రశాంత్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించాడు. క్రీడాకారుడి మృతదేహం వద్ద కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి తోట సురేశ్‌కుమార్, కబడ్డీ క్రీడాకారులు, వివిధ పార్టీల నాయకులు మల్లెపాక మధు, జంగం ఉప్పలయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, వల్లూరి కృష్ణారెడ్డి, కడియం సత్యం, గుగులోత్ రవినాయక్, పీఈటీలు మేక దామోదర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వెయిటర్..



ఓదెలు మృతదేహం

హసన్‌పర్తి: హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని భీమారం సెంటర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పరకాల మండలం లక్ష్మీపురానికి చెందిన అముదాలపల్లి ఓదెలు (45) మృతి చెందాడు. ఓదెలు భీమారంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడు. పని ముగిసిన తర్వాత ఓదెలు సమీపంలోని ఓ రెస్టారెంట్ అండ్ బార్‌లో ఖాళీ మద్యం సీసాలు సేకరించి అమ్ముతాడు. మంగళవారం రాత్రి పని ముగిసిన తర్వాత సీసాలు సేకరించి రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓదెలును ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున అతడు మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మీ అవినీతిని రికార్డు చేస్తున్నా



రఘునాథపల్లి: రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ హల్‌చల్ చేసింది. 'మీరు సరిగ్గా పని చేయట్లేదు. స్టేషన్‌లో అవినీతి ఎక్కువైంది. ప్రజలకు న్యాయం దక్కడం లేదు. మొబైల్‌లో అంతా రికార్డు చేస్తున్నా..' అంటూ గురువారం ఆమె రెండుగంటల పాటు హంగామా చేసింది. ఈక్రమంలో పోలీసులు, మహిళకు మధ్య వాగ్వాదం జరిగింది. వీడియో తీస్తున్న మహిళ దగ్గరి నుంచి మొబైల్ తీసుకొని పరిశీలించిన పోలీసులు అది పని చేయట్లేదని గుర్తించారు. కాగా.. అక్కడే ఉన్న ఎస్సై ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం గమనార్హం! అనంతరం పోలీసులు ఆమె గురించి వివరాలు ఆరా తీయగా.. ఆమెకు మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడు ఇలాగే చేస్తుందని తెలుసుకున్నారు. గతంలో తాను పోలీస్‌నంటూ వాహనాలు తనిఖీ చేసినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 10 మందికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. 12 మందిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు చెప్పారు. ఘూక్య రవి, బెల్లం రాకేశ్‌కు జైలు శిక్ష విధించారు.

ప్రీతి ఘటనలో సమగ్ర దర్యాప్తు జరపాలి

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే

కొడకండ్ల: ప్రీతి మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే డిమాండ్ చేశా. గురువారం గిర్నితండాలో నిర్వహించిన ప్రీతి పంచమ దిన కర్మ కార్యక్రమానికి రోహిత్ చౌదరి, మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డితో కలిసి ఆయన హాజరై నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మాణిక్‌రావు థాక్రే విలేకరులతో మాట్లాడుతూ.. ప్రీతి ఎలా మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. ప్రీతి ఘటనను సీబీఐచే విచారణ జరిపించాలని మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ కోఆర్డినేటర్, ఓబీసీ పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి, పీసీసీ కార్యదర్శి గోమాత శ్రీనివాస్ తదితరులు ప్రీతి కుటుంబీకులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, అంజయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి: మాజీ ఐఏఎస్



ప్రీతి చిత్రపటానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న మురళి

పీజీ వైద్య విద్యార్థి దరావత్ ప్రీతిది ఆత్మహత్య కాదు హత్యే అనే అనుమానాలున్నందున జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, డాక్టర్ పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. గురువారం గిర్నితండాలో ప్రీతి పంచమదిన కర్మ కార్యక్రమానికి డాక్టర్ పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ప్రీతి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలపై కుటుంబసభ్యులకు నమ్మకం లేనందున జ్యుడీషియల్ ప్రభుత్వం విచారణ చేయించి అనుమానాలను నివృత్తి చేయాలని, నిందితులను గుర్తించి శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రీతి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాణిక్‌రావు థాక్రే

సస్పెండ్ చేయాలి: న్యాయ పోరాట కమిటీ

హన్మకొండ: దరావత్ ప్రీతి మృతికి పరోక్ష కారకుడైన డాక్టర్ నాగార్జునరెడ్డిని బదిలీ చేసి చర్యలు తీసుకున్నట్లు చూపి చేతులు దులుపుకోవడం కాదని, ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని డాక్టర్ ప్రీతి న్యాయపోరాట కమిటీ ప్రతినిధులు బానోతు నెహ్రూ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, మంద కుమార్ మాదిగ, జైసింగ్ రాథోడ్, సునీత నాయక్ డిమాండ్ చేశారు. అదే విధంగా సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపించి, అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.